క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలతో ధర్నా చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్ ఎస్వీ రమణను 1/2009 సర్కులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారన్నారు. రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంయూ డిపో కార్యదర్శి టి. త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌పీరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ ప్రో చాన్సలర్ శ్రీనివాసరెడ్డి

గండేపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి సూచించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 2025 ఆదిత్య క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ టోర్నీలో 100కు పైగా జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి. సురేష్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఏలేశ్వరం గురుకుల కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సిద్ధం చేస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాలతో పాటు మూడు ప్రైవేట్ కళాశాలలను ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 396 మంది, ద్వితీయ సంవత్సరం 298 మంది, గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం 375 మంది, ద్వితీయ సంవత్సరం 275 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ జరుగుతాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. తొలిసారిగా ఇన్విజిలేటర్లు జంబ్లింగ్ విధానంలో విధులకు హాజరుకానున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో మాస్ కాంపీయింగ్‌ను అరికట్టడంతో పాటు ప్రతి విద్యార్థి స్వేచ్ఛగా పరీక్షలు రాసేందుకు వీలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిమిత్తం గురుకుల కళాశాలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.శారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా కె.సత్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.బాబ్జీ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పి.రామకృష్ణ వ్యవహరించనున్నారు.

తునిలో..

తుని: పట్టణంలో శనివారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కస్టోడియన్లు ప్రభాకర్, తారకేశ్వరి శుక్రవారం తెలిపారు. పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో 2,887 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు.



ఏలేశ్వరంలో పరీక్షల నిర్వహణపై సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ బాబ్జీ

మాకు న్యాయం చేయండి

- అధికారులను కోరిన ఏడీబీ రోడ్డు విస్తరణ బాధితులు



గండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

గండేపల్లి: ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల్లో సర్వం కోల్పోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు అధికారులను కోరారు. మండలంలోని రామేశంపేట వద్ద రోడ్డు పనులు ప్రారంభించేందుకు అధికారులు అక్కడి నిర్మాణాలను తొలగించారు. కాగా శుక్రవారం గండేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులతో ట్రైనీ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ సీహెచ్ భావన, పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతు ప్రస్తుత వాల్యూకు అనుగుణంగా తమకు నష్టం పరిహారం ఇవ్వాలని కోరారు. రోడ్డు విస్తరణ నిమిత్తం సుమారు 8 సంవత్సరాల క్రితం స్థానికులతో సమావేశాలు నిర్వహించి అప్పటి వాల్యూ ప్రకారం ధరలు నిర్ణయించారన్నారు. ఇప్పుడు నిర్మాణాలు తొలగిస్తున్నారని, ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు రెట్టింపు అయ్యాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారంతో ఇల్లు కట్టుకోవడం సాధ్యమా ? అని ప్రశ్నించారు. ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడవద్దని, రోడ్డు విస్తరణలో నిర్మాణాలు కోల్పోయిన వారికి అర్హతను బట్టి ఒక్కొక్కరికి 5 సెంట్ల వరకూ ఇళ్ల స్థలం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి ఖాళీ ప్రదేశాలను గుర్తించాలని స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బాధితులు బమ్మిడి శివ శంకర్, నవీన్ కుమార్, గుబ్బల ప్రభాకర్, మొల్లి అప్పారావు, గింజాల దుర్గా ప్రసాద్, శ్రీనివాసరావు, టీకిరెడ్డి త్రిమూర్తులు, వెంకట రమణ, సురేష్, పెదపూడి రాజు, మోహన్ రాజు, గుబ్బల శ్రీను పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ



జగ్గంపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మరుకుర్తి ఏసు

జగ్గంపేట: దేశంలో కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడవలసిన సమయం ఆసన్నమైందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మరుకుర్తి ఏసు అన్నారు. స్థానిక స్టాలిన్ భవనంలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకూ విడివిడిగా కార్మిక పోరాటాలు సాగిస్తున్న ఐఎఫ్‌టీయు సంఘాలను విలీనం చేస్తున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద ఆదివారం జరిగే విలీన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గంటా బాలరాజు, సైకిల్ షాపు వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్, దుర్గారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



తునిలో ఏర్పాటు చేసిన అర్బన్ బజారు

తుని: మహిళలు సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణ సూచించారు. స్థానిక వీరవరపుపేటలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వం ద్వారా బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన బ్యాగులు, ఇతర వస్తువులు కొనుగోలు దారులను ఆకర్షించాయి. మెప్మా అధికారిణి శ్రీదేవి, డ్వాక్రా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: మాఘ అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, కోట వంశీ, వేణు, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు, 25 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఎస్.అన్నవరంలో సామూహికంగా అరుణ హోమం, నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా సామూహిక అరుణ హోమం

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక అరుణ హోమం నిర్వహించారు. మాఘమాసంలో చివరి రోజును పురస్కరించుకుని శుక్రవారం దేవస్థానం ఆవరణలో సామూహిక అరుణ హోమం, పూర్ణాహుతి, అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణమూర్తి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొనగా అర్చకులు శాస్త్రోక్తంగా హోమం పూర్తి చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి అన్నప్రసాదం స్వీకరించారు.

అంకెల గారడీ బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న శివ గణేష్

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప కేటాయింపులు శూన్యంగా ఉన్నాయని జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ అన్నారు. మండలంలోని బలభద్రపురంలో రాష్ట్ర బడ్జెట్‌పై శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌తో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసగించిందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు అన్ని వర్గాలనూ మోసం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు వత్సవాయి సత్యనారాయణరాజు, ఏపీ సీసీ జనరల్ సెక్రటరీ నక్క సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

గండేపల్లి: తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 8000 మంది భక్తులు స్వామివారిని దర్శించి అన్న ప్రసాదం స్వీకరించారు.

జీతాలు ఆపడానికి కారణాలు చెప్పండి



ఏపీఓ రాజగోపాల్‌ను ప్రశ్నిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కోటనందూరు: తమ జీతాలు ఆపడానికి కారణాలు చెప్పాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ఏపీఓ రాజగోపాల్‌ను నిలదీశారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో శుక్రవారం పాతకొట్టాం, బిళ్లనందూరు, ఇండుగపల్లి ఫీల్డ్ అసిస్టెంట్లు బర్రె దుర్గాప్రసాద్, నాగులాపల్లి జోగిరాజు, దుత్తాడ శ్రీనివాస్ ఏపీఓను కలిసి జీతాలు ఎందుకు ఆపారని ప్రశ్నించారు. మమ్మల్ని అధికారికంగా విధుల నుంచి తప్పించండి లేదా జీతాలు ఇవ్వండని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏపీఓ స్పందిస్తూ సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో జీతాలు ఆపామని, ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ మండలంలో 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండగా అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు తమతో రాజీనామా చేయించారని ఆరోపించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



తునిలో విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: విద్యార్థులు సైన్స్‌లో వంద శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ గవర్నర్ చదరం శివాజీ సూచించారు. నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బ్యాంకుకాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు డీఎస్.మూర్తి సమకూర్చిన పరీక్ష అట్టలు, పెన్నులు, ఇతర సామగ్రిని పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. త్వరలో జరిగే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని శివాజీ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సోమయాజులు, వెంకటేశ్వర్లు, జోసెఫ్, కుందెం సత్యనారాయణ, వాడపల్లి శ్రీనివాస్, పర్వత బాబూరావు, ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండలంలోని అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు తెలిపారు. వేమవరం, యర్రయ్యపేట, పైడికొండ, జీఎం పేట తదితర గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా టైలర్స్ డే

- సీనియర్ టైలర్లకు సత్కారం
- దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



కోటనందూరులో సీనియర్ టైలర్‌ను సత్కరిస్తున్న దర్జీలు

ఏలేశ్వరం: కుట్టుమెషీన్ సృష్టికర్త విలియమ్స్ హో జయంతిని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సాయి టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలియమ్స్ హో కుట్టుమెషీన్ సృష్టించడంతో వేలాదిమందికి జీవనోపాధి లభించిందన్నారు. విలియమ్స్ హోను టైలర్స్ ఎన్నటికీ మరవరన్నారు. అనంతరం పట్టణంలో ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి, సంఘనాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక కొత్తపేట రామాలయం ఆవరణలో శుక్రవారం ప్రపంచ దర్జీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుట్టుమెషీన్ రూపకర్త విలియమ్స్ హో చిత్రపటానికి మండల టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏలూరి వెంకటరమణ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుట్టుమెషీన్‌ను రూపొందించి, దర్జీలకు ఉపాధి మార్గం చూపిన విలియమ్స్ హో సేవలను కొనియాడారు. టైలర్స్ యూనియన్ నాయకులు వెదురుపాక ఆదినారాయణ, రాపర్తి పెద సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శంఖవరం: గ్రామంలో శివదుర్గ టైలర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ టైలర్స్ దినోత్సవం నిర్వహించారు. కుట్టుమెషీన్ వ్యవస్థాపకుడు విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ మేడిశెట్టి నాగేశ్వరరావు, శ్రీకాకుళపు రమణ, నక్కా శ్రీను, వీర్రాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలి

కోటనందూరు: ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని మండల నూకాంబికా ప్రైమరీ కోపరేటివ్ టైలర్ల సంఘ అధ్యక్షుడు కోటిపల్లి గోవిందు కోరారు. స్థానిక నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం టైలర్ల దినోత్సవం నిర్వహించారు. కుట్టుమెషీన్ పితామహుడు విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ టైలర్ అల్లూరి సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. టైలర్లు ఉల్లూరి శ్రీను, మామిడి నాగబాబు, ఎస్కే మీరా,జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



దివ్యాంగ చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు శుక్రవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు పిల్లలతో వ్యాయామాలు చేయించారు. పిల్లలతో రోజూ చేయించాల్సిన వ్యాయామాలు, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ ఎంవీ రామశేఖర్ పరిశీలించారు. ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ శేఖర్, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

విజ్ఞానంతోనే మానవ వికాసం

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టులు, ప్రదర్శనలు

తుని రూరల్: విజ్ఞానంతోనే మానవ వికాసం సాధ్యమని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ అమృతవాణి పేర్కొన్నారు. మండలంలోని వి.కొత్తూరు కేజీబీవీ, ఎస్సీ గురుకుల, ఎస్టీ బాలికోత్తన్న పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ విజ్ఞాన (సైన్స్ డే) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులు రూపొందించిన సాంకేతిక చిత్రాలను ప్రదర్శించారు. వి.కొత్తూరు కేజీబీవీలో విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు సైన్స్ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్థానిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల అధ్యాపకులు వరలక్ష్మి, రజని, డిగ్రీ కళాశాల అధ్యాపకులు గోపాలకృష్ణ, మల్లికార్జునశర్మ, వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ గడ్డిపేట జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు సర్‌సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం వంటి పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనను తిలకించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వీవీఎస్ సత్యనారాయణమూర్తి, సైన్స్ టీచర్స్ ఎ.శ్రీనివాసరెడ్డి, మరువాడ శ్రీదేవి, ఇ.జయ, ఎస్ఎంసీ చైర్మన్ బి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

తుని: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, క్రామన్స్ రీసెర్చ్ పార్క్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ మిజయ్ విట్టల్ మతాడ్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ సైన్స్ డే వేడుకలను ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కేవీ రమణతో కలిసి ఆయన ప్రారంభించారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన 300 మంది విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, పవర్ పాయింట్, క్విజ్, సైన్స్ ప్రాజెక్టులపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌కే నరసింహారావు, విద్యాసంస్థల సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి నరేంద్రబాబు, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.



పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఏలేశ్వరం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో ప్రిన్సిపాల్ జోసెఫ్ ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో సైన్సు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు సెన్సార్ కార్, కాలుష్యం, పర్యావరణం రోబోటిక్స్, జంతుకణం, వృక్షకణం తదితర ప్రాజెక్టులు తయారు చేశారు. అనంతరం సెమినార్, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మనీషా, డీన్ కెకృష్ణ, ఉపాధ్యాయులు కల్యాణ్, మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.